# సానరాయి

"తేదీ ఎంత? పది కదా...బాడుగ దుడ్డు కోసరం ఇంటి గల్లాయన మూడు రోజులనుంచి తిరగతా ఉండాడు."

సైకిలెక్కి పోయోస్తానని చెప్పబోతున్న సురేంద్ర, భార్య సుజాత వైపు కోపంగా చూశాడు. సైకిల్ దిగి స్టాండ్ వేసి లోపలకు వస్తూ...."ఎన్ని సార్లే నీకు చెప్పేది, పనిగా పొయ్యేటప్పుడు ఇట్లా మాటలు మాట్లాడద్దని. ఐదో తేదీనే బాడుగ ఇవ్వాలనే సంగతి నాకు తెలీదా. మన పరిస్థితి చూస్తాండావు గదా! ఆ మాత్రం చెప్పుకోలేవా?" అంటూ స్టూలు మీద కూర్చున్నాడు.

"అప్పటికీ చెప్తానే ఉండాను వారం తర్వాత ఇస్తామని. ఆయనకేదో నిండా అవసరమంట." అంది ముభావంగా.

"వోళ్లు ఆలుమగలు ఉద్యోగాలు చేస్తారు. నెలపెడితే ఇరవై వేలు వస్తాది. అట్లా వోళ్లు కూడా మనమిచ్చే నాలుగునూర్ల బాడుగతోనే బతకతాన్నెట్టు మాట్లాడతారు. ఏం చేద్దాం. మన రాత అట్లుండాది. ఎప్పుడు తప్పుతాదో ఏమో ఈ బాడుగిండ్ల బాధ" నిరుత్సాహంగా అన్నాడు సురేంద్ర. మళ్లీ తనే "బాడుగే కాదు. కాన్పుకు డాక్టరు చెప్పిన డేట్ ఇంక ఇరవై రోజులే వుండాది. కాన్పుకు ఆడోళ్ల ఆసుపత్రికి పోయినా కనీసం రెండు మూడు వేలన్నా చేతిలో వుండాల. ఒగ రూపాయి లేదింట్లో. ఎట్ల చేసేదో ఏమో" అన్నాడు ఎత్తుగా వున్న భార్య కడుపును చూస్తూ.

"చుక్కెదురు లేకుండా వున్నింటే మా అమ్మోల్లు పిల్చక పోయుందురు." అందామె.

సురేంద్ర కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

"కానీలే...ఎట్లోగట్ల చేద్దాం. పద్దన్నే మాటలు పెట్టుకుంటే అవతల మేస్త్రీ ఎల్లిపోతాడు. ఈ రోజు ఒక ఇంటిపని ఇప్పిస్తానన్నేడు. కాంట్రాక్టర్ దగ్గరికి, ఇంజనీర్ దగ్గరికి రోజూ పోతాండా. ఎవురో ఒకరు పనులు ఇప్పిస్తారు. సొంత పనులు చేసుకుంటే ఏ ఇబ్బందీ వుండదు. ఓగేళ యాడా పని కుదరకపోతే ప్రసాద్ దగ్గరికి పొయ్యి ఐదు నూర్లు తీసుకొని వస్తా. బాడుగ ఇచ్చేద్దాం. పద్దన్నే నీతో మాటలు పెట్టుకుంటే అంతే మల్ల. వస్తా" అంటూ వెళ్లి సైకిలెక్కాడు సురేంద్ర.

సురేంద్ర జోరుగా ముందుకు వెళుతున్నాడే కానీ అతని ఆలోచనలు మాత్రం పది సంవత్సరాల వెనుక్కు పరుగులు తీసాయి.

"పనొచ్చా"

"నిన్నే ఊరినుంచి వచ్చినాడున్నా. నాకు బామర్ది అవుతాడు."

"నీకు బామర్దా, బావా అని కాదు అడగతాండేది. పనొచ్చా అని."

"వచ్చున్నా. మా గ్రామం మొత్తానికి నేనే మంచి పనోన్ని." అన్నాడు సురేంద్ర.

"అయితే ఈడికెందుకు వచ్చినావు. అన్నే ఉండచ్చు కదా?"

"పనులుంటే కదాన్నా ఆడుండేదానికి. అమ్మా నాయన్ను అందరినీ వదిలి ఇంత దూరం ఎందుకొస్తాం. పనులున్నే లేకపోయినా పస్తులున్నే అన్నే ఉన్నిందు. ఇద్దో....మా మామ ఉండాడు చూడు. దీపావళికి మావూరు వచ్చిన్నేడు. ఈడెందుకు ఈన్ని ఊరికేనే పెట్టుకోనుంటారు. తిరపతికంపిచ్చండి. ఆడ రోజూ పనే. పనిలేదనే మాటే లేదు. చేసే వాడుండాల్నేగానీ రాత్రింపగలూ పనుంటాది. వారం వారం దుడ్డు చేతి కొస్తాది అని ఇంట్లో చెప్పినాడు. ఇంగ అప్పట్నుంచి మా ఇంట్లో రోజూ ఒకటే పోరు. అందుకే వచ్చినా."

"సరే సరేలే. మీ మామ మాదిరిగా పని అక్కరగా చేయాల. చంద్రా నీ ఎనకంటీ పిల్చకపో. తలుపులు కిట్ట కోసేసి పిన్నేసేయండి. మెయిన్ డోర్ మాత్రం కలదోసేసి మక్కు పెట్టండి. మాధవమాలాయన ధర్మాచారుండ్లా. బొమ్మ చెక్కేదానికి వస్తాడంట."

"నిన్నే కలదోసేసినాంనా. పోతానే మక్కుపెట్టేసి మిగిలి నోటియి ఎత్తుకుంటాంలే."

"సర్లేపొండి. పొండి. లేటయిపోయింది. ఇంటిగలోల్లు అడిగితే పది గంట్లకొస్తానని చెప్పు." చంద్ర సైకిల్ తీసుకున్నాడు.

"నేను తొక్కతానీ మామా."అంటూ సురేంద్ర సైకిల్ హేండిల్ పట్టుకున్నాడు.

"తొక్కడం వచ్చా. టౌను కదా."

"ఏంది మామా. నీయట్లా వోళ్లను ముగ్గుర్ని కూడా తొక్కతా. బెంగుళూర్లోనే డబుల్స్ తొక్కినా. తిరపతొక లెక్కా. కుచ్చోమామా" అంటూ సైకిల్ ఎక్కాడు సురేంద్ర.

ఇద్దరూ మారుతీనగర్‌నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అవిలాలలకు చేరుకున్నారు. అప్పటికే తాపీ మేస్త్రీలు వచ్చి పనిలో దిగారు.

"ఏంనో ఆచారన్నా లేటు" అంది ఇసక జల్లిస్తున్నామె.

"నువ్వెంతకు రమ్మని చెప్పింటే అంతకే వచ్చింది కదా." అన్నాడు చంద్ర.

"బోవచ్చే మొగోడుబ్బా. మీ ఇంట్లో చెప్తానుండు."

ఆమె మాటలకు నవ్వుకుంటూ ఇద్దరూ లోపలికి వెళ్లారు.

"సామాన్లన్నీ తీసి బయటపెట్టు. రెండించీల అలుగు, ఒకటిన్నరించి ఉలి నూరు." అంటూ సురేంద్రకు పని చెప్పాడు చంద్ర.

అలుగు, ఉలి చేతికి తీసుకొని ఇటూ అటూ వెతక సాగాడు సురేంద్ర.

"ఏంది తాలాడతాండావే"

"కనికిరాయి పొడి"

"కనికిరాయి పొడి యాడుంటాది. సానరాయి ఉండాది నూరు."అన్నాడు చంద్ర నవ్వుతూ.

"సానరాయా? రోజుకు పదిసార్లు నూరతాం. అరిగి పోతాండ్లా...."

పెద్దగా హారన్ విన్పించడంతో సురేంద్ర ఆలోచనలకు అంతరాయం కలిగింది. వెనక్కు తిరిగి చూశాడు. తనకు ఆనుకోని వస్తున్నట్టుగా లారీ వస్తోంది.

"ఏమయ్యా సామి..., బతకాలని ఆశ లేదా? నడి రోడ్డుమింద వస్తాండావే?" అనరచాడు లారీలోంచి క్లీనర్. తన పరధ్యానానికి సిగ్గుపడుతూ పక్కకు తప్పుకున్నాడు సురేంద్ర.

మేస్త్రీ ఈ రోజన్నా ఏదన్నా పని ఇప్పిస్తే బాగుండు అనుకొన్నాడు. అంతదూరం నుంచే మేస్త్రీ స్కూటర్ ఇంటి దగ్గర లేంధి గమనించాడు. ఇంత పద్దన్నే ఎక్కడికి పొయ్యినాడు అనుకుంటూ ఇంటి ముందు సైకిల్ స్టాండ్ వేసి నిల్చున్నాడు.

"లోపలకు రా ఆచారి. ఆన్నే నిల్చుకొన్నేవే."

సురేంద్ర లోపలకు పరిశీలనగా చూశాడు.

నల్లటి శరీరం. పెద్ద పొట్ట. తెల్లపంచె, తెల్ల షర్టు. పేపర్ చేతిలో పట్టుకుని కూర్చుని ఉన్నాడు మునిస్వామి.

"మీరాన్నా...నేను చూడలా." అంటూ లోపలకు వెళ్ళాడు సురేంద్ర.

"ఏమోయ్ ఎట్లుండాది నీ పని" అన్నాడతను పేపర్ మడిచి పక్కన పెడుతూ.

"ఏదో మీయట్లా వోళ్ల దయ. ఫర్వాలేదన్నా"

"నాదేముండాదిలే, అంతా మీ మేస్త్రీదే. నీతో పాటు పని చేస్తాన్నేడే రమణ. వాడు యాడికి పోయినాడు. కనపడేదే లేదే."

"వాళ్ల భార్యకు ఒంట్లో బాగలేదని ఊరుకు పోయినాడునా."

"అంతా దొంగెత్తు. ఆ మాదిరిగా చేస్తే దుడ్డడగకుండా ఉంటాడని. నేను చానా చెడ్డ నా కొడుకును. ఇప్పటికి రెండు నెలలయింది వడ్డీ ఇచ్చి. ఇంగో వారం రోజులు చూస్తా. వచ్చి ఈలేదనుకో, పోలీసుల పిల్చుకోని వాళ్ల ఊరికి పోతా. నేనెంత మంచోన్నో అంత చెడ్డోన్ని."

"ఇస్తాదులేన్నా. వాళ్ల భార్యకు బాలింత జనంట. యాడేడ్నో చూపిస్తాండారు. ఒగరి దుడ్డు ఎగ్గొట్టే రకం కాదు. కొంచెం లేటయినా ఇస్తాడు." సర్ది చెప్తున్నట్టుగా అన్నాడు సురేంద్ర.

"ఈని మాదిర్తో ఇంగో పదిమంది ఆపేస్తే నా పని గోవిందా. రోజుకు నోటేబై కూలి తీస్తారే. ఏం చేస్తారయ్యా ఆ దబ్బంతా?"

"నోటేబై ఎవురిస్తాండారున్నా, రోజూ పనిచ్చే మేస్త్రీ మంచి పనోనికి నోటిరవైకి మించి ఈలా. ఇంటి బాడుగలు, పెండ్లాం, బిడ్డలు, ఖర్చులు ఉంటాండ్లా. కూలికి పోతే ఏం మిగలతాదన్నా. ఆ పని కూడా ఒకోసారి ఉండదే."

"ఖర్చు చేసేదానికేం. నేను కూడా రోజుకు వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తా, ఉంటే. మీరేం కష్టపడతాండారు? తోపుడుకు మిషను వచ్చేస. రౌండు కటింగులు, డిజైన్ అంతా మిషన్లే కదా! ముందు మాదిరితో కష్టంలేని పని. రాత్రుల్లో కూడా పని చేసుకోవచ్చు. ఆచార్లంతా నోంబేర్లయి పోతాండారు."

"ఎంత మిషన్లొచ్చినా మేం చేసే పని ఉండనే ఉండాది కదాన్నా. మనుషులు లేకుండా అంత పనీ మిషన్లే చేస్తాయా?" ప్రశ్నించాడు సురేంద్ర.

"ఆc...మీదీ ఒగ పనేనా. దాలమంద్రం రెండు దుంకలు కొడతారు. తగిలిచ్చేస్తారు. గంట సేపట్లో అయిపోతాది. దానికి నూరు రూపాయలు తీసుకుంటారు. ఒళ్లొంచకుండా రోజుకు ఐదారునూర్లు సంపాదిస్తారు కదయ్యా. ఆదీకం లేనట్టు, పెద్ద కష్టమంతా మీరే పడతాన్నెట్టు మాట్లాడతారే."

"ఇంతకు ముందు కొంత చిల్లర ఇవ్వాల్నా నువ్వు."

"ఓరోరి. అందరి దగ్గరా నేను డబ్బులు వసూలు చేస్తాంటే, నా దగ్గర నువ్వు వసూలు చేసేటిగా ఉండావే. అయినా ఇంకా ఏమివ్వాల నీకు."

"ఆ రోజు మీ ఇంట్లో చిల్లర పనులన్నీ చేస్తి కదాన్నా. డెబ్బై ఇచ్చినావంతే." గుర్తుచేశాడు సురేంద్ర.

"ఇంగెంత ఈమంటావు. వేరే ఎవరన్నా అయ్యింటే యాబై గూడా ఇచ్చిండను. రమణా గోడయింటే నా దగ్గిర దుడ్డే తీసుకోనుండడు."

"ఇంతవరకు నువ్వే కదాన్నా రోజుకు నూటేబై రూపాయలు కూలి ఇస్తాండారన్నేవు. ఆ రోజు పద్దన్నే ఎనిమిదికొచ్చి రాత్రి పద్దాక చేస్తినే. అదే ఇంగెవరన్నా అయ్యింటే కనీసమంటే రెండు నూర్లన్నా ఇచ్చిందురు. నువ్వు యాబై తగ్గించుకోని ఇంగ ఎనబై అన్నా ఈ."

"నీకు పనిచేతకాక అంత రాత్రిదాంకా చేసినావు. అదే ఇంగెవరన్నా అయింటేనా రెండు గంటల పని."

"పనయి పోయినాంక ఎట్లయినా మాట్లాడతారులేన్నా. మా నాయన అనేవోడు 'పాత పని ఎత్తుకోవద్దు పల్లెకు పగ కావద్దు అని' ఏం చేసేది. మారాతలట్లుండాయి. ఈకుంటే పోయినావులే పోన్నా. నా చేతల కష్టమే కదా! ఎప్పటికయినా నువ్వు నాకు రుణమే కాని నేను నీకు కాదు కదా!"

"ఓరోరి. ఎన్నెన్ని మాటలు చెప్తాండావు ఆచారి. అంత బాదెందుకులే. నీకు ఇవ్వాలనే

అనుకుంటా ఉండా. జోబీలో దుడ్డు ఉన్నెప్పుడు నువ్వు కన్పించవు. రమణగాడు రానీ. ఇంగో ముప్పై ఇస్తా."అన్నాడు నవ్వుతూ అతను.

"ఎంత సేపయిందన్నా వచ్చి." అంటూ వచ్చాడు మేస్త్రీ.

"నేనొచ్చి గంటయింది. ఆచారొచ్చి అరగంటయితాండాది."

"ఏమాచారి పద్దన్నే వచ్చినావే."

"ఈరోజు ఏదో ఇంటి పని ఇప్పిస్తానంటిరి కదాన్నా." అన్నాడు సురేంద్ర చేతులు నులుముకుంటూ.

"నువ్వు గూడా పద్దన్నే వచ్చినావే."

"ఏం చేసేది నాయనా. తప్పుతాదా. ఈరోజు తేదీ ఎంత? పదికదా! వడ్డీ డబ్బుకోసం వచ్చినా."

"టీ తాగినావాన్నా."

"అంతా అయింది. నీకోసరమే కాసుకోనుండా."

"సాయంత్రం నేనే వస్తాన్లే ఇంటికాడికి. నాలుగుతావల పని జరగతాండాది. ఒగింటి పని అయిపోయింది. మద్యానం లెక్కలు చూస్తాం."

"సరే అయితే నేను పోతాండా." అంటూ లేచాడతను.

"ఉండన్నా టిఫిను తినేసి పోదువు."

"లేదయ్యా. ఇంగా రెండు తావలకు పోవాల. యాడో ఒక తావన తింటాన్లే. సందేళ నువ్వు మరిచిపోవద్దు." అంటూ వెళ్లిపోయాడతను.

అతనటు వెళ్లగానే మేస్త్రీ ఇంట్లోకి వెళ్లాడు. సురేంద్రతో ఏ విషయం చెప్పలేదు. మౌనం అర్ధాంగీకారమనుకుని సరేంద్ర ఆశగా ఎదురు చూస్తున్నాడు. పొద్దుట్నుంచీ నిల్చుకుని అతనికి కాళ్లు నొప్పులు పుడుతున్నాయి. గంట తర్వాత మేస్త్రీ బయటకు వచ్చాడు.

"నువ్వింకా ఈన్నే ఉండావా." అన్నాడు సురేంద్రనుద్దేశించి.

"……"

"సరేలే. విద్యానగర్‌లో పని జరగతా ఉండాది. తెలుసు కదా! ఆడికి పో. అరగంటలో వస్తా." అన్నాడతను.

"లెక్చరర్ ఇళ్లే కదాన్నా"

"ఆ…అదే. ఆడే ఉండు వచ్చేస్తా."

"సరేన్నా"అని సురేంద్ర సైకిలెక్కి అరగంటకంతా అక్కడకు చేరుకున్నాడు.

"ఏమాచారన్నా చానా దూరం వచ్చినావే."

"కూటికోసం కోటి తిప్పలు. తప్పుతుందా."

"ఔనూ... నువ్వు నెలరోజులనుంచీ మా మామోళ్ల ఇంటికి తిరగతాండావే. ఏం కత" అన్నాడతను చేస్తున్న పనిని ఆపి.

అది మూడంతస్తుల బిల్డింగు. పిల్లర్స్ వేసేసారు. గోడల పనులు జరుగుతున్నాయి. ఇంకా దాలమంద్రాలు, కిటికీలు పెట్టలేదు. ఆ బిల్డింగును పరిశీలనగా చూస్తూ "ఈ ఇంటిది ఆచారి పని ఇంగా ఎవురికీ ఈలా కదా?" అన్నాడు.

సురేంద్ర అడిగిన ప్రశ్నతో అతనెందుకు వచ్చింది నారాయణకు అర్థమయింది.

"నువ్వు చానా రోజులనుంచి మా మామ ఇంటికి తిరగతాండావున్నా. నీకు సంగతి తెలిసినట్లు లేదు. ఇట్లరా చెప్తా." అంటూ చేతిలో ఉన్న కరిణెను కిందవేసి కొంత దూరంలో ఉండే చెట్టుకిందకు దారి తీసాడు. సురేంద్ర అతన్ని అనుసరించాడు. చెట్టుకిందకు పోతూనే నారాయణ బీడీ వెలిగించాడు.

"తాగతావాన్నా బీడీ."అన్నాడు.

"బీడీ సిగరెట్టు ఏమీ అలవాట్లు లేవు నారాయణా."అన్నాడు సురేంద్ర.

"ఈ కాలం ఎవురున్నా ఇంగా నీ మాదిర్తో ఉండేది. సుధాకరాచారి తెలుసా?"

"కొర్లగుంటలో ఉంటాడే. ఆయనే కదా!"

"ఆయనే. వారమప్పుడు వచ్చి మేస్త్రీని కలిసినాడు. ఈ బిల్డింగు పని ఆయనకే ఇప్పించినాడు."

"అవునా...నేను నెలరోజులనుంచి తిరగతానే ఉండానే. నాకిప్పిస్తానంటా ఉండాడు. ఇప్పీలా?" అన్నాడు బాధగా సురేంద్ర.

"నీకు లోకం గురించి తెలిస్తే కదా! మేస్త్రీ ఇంట్లో ఉండే టివి స్టాండు చూసినానా. కొత్తది. అది సుధాకర చేసిచ్చిందే. నువ్వు కొయ్యలు కొన్నెప్పుడు కమీషన్ తీసుకుంటావా?"

"ఛఛ..అట్లా తప్పుడు పనులు చేయను." అన్నాడు కంగారుగా సురేంద్ర.

"అదీ...అట్లే ఉండు. నీకు ఈ జన్మలో సొంత పనులు రావు. నీకు మేస్త్రీ పని ఇప్పించినాడనుకో. కొయ్యల్లో నువ్వు ఎంతన్నా కమీషన్ తీసుకో. మేస్త్రీకి మాత్రం పది పర్సంట్ ఇయ్యాల్సిందే. మీ పనంతా అయినాంక, ఆడుక్కు నాలుగు రూపాయలు మేస్త్రీ తీసుకుంటాడు. ఆ మాదిర్తో ఇచ్చే వాళ్లకే మా మామ పని ఇప్పిస్తాడు." అన్నాడు నారాయణ మెల్లగా.

సురేంద్రకు బుర్ర పని చేయలేదు. కొంతసేపటి తర్వాత "నిజమా" అన్నాడు.

"నీకు నేనెందుకు అబద్ధం చెప్తాన్నా. రోజూ తిరగతాండేది చూస్తాండా కదా! నువ్వు తిరిగేది చూస్తాంటే నాకే అయ్యో అనిపిస్తాండాది. అందుకనే అసలు సంగతి చెప్పినా. మేస్త్రీ వస్తే నీ పర్సంటేజీ చెప్పు. మిగిలినోళ్లకన్నా నువ్వు రెండు రూపాయలు ఎక్కువ ఇస్తానంటే పని నీకే ఉంటాది. నేనొస్తాన్నా. పని జరగలా..." అని వెళ్లిపోయాడతను.

సురేంద్రకు ఏం చేయాలో అర్థం కాలేదు. తనలో చిన్నప్పటినుంచి తండ్రి నూరి పోసిన నిజాయితీ ఇంకా నిప్పులా కదులుతూనే ఉంది. ఇంక అక్కడ మేస్త్రీ కోసరం ఎదురు చూడాల్సిన అవసరం లేదనుకున్నాడు. ఇంజనీరు పదకొండు గంటలకు రమ్మన్న విషయం. గుర్తుకు వచ్చింది. సైకిలెక్కి భవానీ నగర్‌లో ఉన్న ఇంజనీరు ఇంటికి బయల్దేరాడు.

"సురేంద్రా...సురేంద్రా..." అనే పిలుపు వినపడటంతో ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"యాడపని..." అంటూ సమీపించాడు ప్రసాద్.

"పనా పాడా...తిరగతాండా... ఈడ భవానీ నగర్‌లో ఉండ్లా కాంట్రాక్టర్, ఆయన ఇంటిపని ఇప్పిస్తానన్నేడు. అందుకని పోతాండా."

"టీ తాగదాం రా" అంటూ పక్కన్నే ఉన్న టీ బంకులోకి దారితీశాడు ప్రసాద్. సైకిల్‌ను రోడ్డు పక్కనుంచి స్టాండ్ వేసి అతన్ని అనుసరించాడు సురేంద్ర.

"రెండు స్ట్రాంగ్ టీ ఎయ్ మాస్టారూ..."

"నాకు లైట్ టీ..."

"పాలు కాగాలన్నా. ఐదు నిమిషాలు కూచ్చోండి."

ఇద్దరూ స్టూల్‌ల మీద కూర్చున్నారు.

"చెప్పు సురేంద్ర. చాలా రోజులయింది కలిసి."

"ఈరోజు పద్దన్నే అనుకొన్నే మీ యింటికి రావాలని. ఇంగా బాడుగ ఈలా. దుడ్డుతో చానా ఇబ్బందిగా ఉండాది. అర్జెంటుగా ఐదునూర్లు కావాల?"

"ఇంతకు ముందు ఒగ ఇంటిపని చేసిన్నా. ఆడ ఇంగా వెయ్యి రూపాయలు రావాల. సందేళ లీలామహల్ కాడ టీ అంగడుండ్లా. ఆడుండు వస్తా."

"యాడ చేస్తాండావు పని? అన్నేనా?"

"ఆఁ...అన్నే చేస్తాండా."

"ఇప్పుడు కరెక్ట్‌గా దుడ్డు ఇస్తాండాడా?"

"ఎందుకులే ఆ మాట. నువ్వున్నెప్పుడే మేలు. ఇప్పుడింగా మోసం అయిపోయినాడు. పనితావుకే రాడు. మనం లేనప్పుడు వచ్చి ఇంటిగలోల్ల దగ్గిర దుడ్డు తీసుకొని పోతాడు. టయానికి సామాన్లు తీసీడు. పనికిపోతే వాళ్లు మమ్మల్నడగతారు యాడ మీ ఆచారి అని."

"ముందు కూడా అంతే కదా! మెటీరియల్ కాంట్రాక్టు ఒప్పుకుంటాడు. దుడ్డు తీసుకుంటాడు. ఆ దుడ్డంతా తాగేదానికే చాలదు. ఇంగ మెటీరియల్ యాడ తీసిస్తాడు. పనులిచ్చే వాళ్లు కూడా ఇట్లా వోళ్లనే నమ్ముతారు. పది రూపాయలు తక్కువకే చేస్తాం. టయానికి చేసిస్తాం మాకియ్యండయ్యా పని అంటే మనల్ను నమ్మరే."

"మంచికి యాడుండాదిలే సురేంద్ర కాలం. ఈ మధ్య ఏమయ్యిందో తెలుసా? ఒగింట్లో

కబోర్డు పని ఒప్పుకోని ముందే దుడ్డంతా లాక్కొన్నేడు. రెండునెల్లు ఆ పక్కకే తిరిగి చూల్లా. వాళ్లు మంచి సౌండ్ పార్టీ. పోలీస్ కేసు పెట్టినారు. ఇంగ చూస్కో మన మేస్త్రీ కత. చిన్న తిప్పలు పళ్లా. ఎవురెవుర్నో పట్టుకుని రాజీకి పొయ్యినాడు. పని చేసిచ్చినాడు. అదేదో ముందే చేసింటే ఎంత గౌరవంగా ఉన్నిందు?"

"ఇంటిగలోల్ల బాధ ఉన్నీలే. వోళ్లంతా చేతిలో దుడ్డు ఉండి పనులు చేపిస్తారు. నెల కాకపోతే ఆర్నెల్లు పని లేటయినా వాళ్లకు బాధ ఉండదు. మనకు వారం వారం దుడ్డు రాకపోతే జరగతాదా? అప్పులు చెయ్యాల. లేదంటే పస్తులుండాల." అన్నాడు సురేంద్ర.

"టీ తీసుకోండన్నా. మళ్ల అరువులు చేద్దురుగానీ" అంటూ చెరొక టీ కప్పు అందించాడు టీ బంకతను. ఇద్దరూ టీ తాగసాగారు కానీ మాటలు మాత్రం ఆగలేదు.

"కొన్ని రోజులు రమేష్ దగ్గరికి పనికి పోతి" అన్నాడు సురేంద్ర.

"హబ్బా..." అంటూ తల పట్టుకొన్నాడు ప్రసాద్.

"నువ్వెప్పుడన్నా పని చేసినావా ఆయన దగ్గిర"

"ఎందుకడగతావులే ఆ మాట. నేను తిరపతికి వచ్చిన కొత్తలో ఆయన దగ్గరే కదా పని చేసింది. దాదాపు నాలుగు సంవత్సరాలు పని చేసినా. ఇంగ నానింటి కాక ఆగిపోతి."

"ఎట్ల పనిచేసినావు సామీ అన్ని రోజులు? నాకు ఆర్నెల్లు ఏగేదానికే కాలేదే. పద్దన్నే ఏడున్నరకు పోవాల. రాత్రి ఎనిమిదిదాంకా పని చెయ్యాల. పది నిమిషాలు లేటయినా అరస్తాడు. మనం ఎగస్టా చేసిందానికి ఏమీ ఈడు." అన్నాడు సురేంద్ర.

"ఎగస్టా కత అట్లున్నీ. మనకియ్యాల్సిన కూలీ సక్రమంగా ఇస్తే చాలు. శనివారం ఇంటిగలోల్లు పేమెంట్ ఇచ్చేదానికి కాసుకోనుంటారు. ఈయన రాడు. ఆదివారం మనలను వోళ్ల ఇంటికాడ ఉండమనేసి పోతాడు. ఆయన వచ్చేలకు మద్యానం కావచ్చు, సాయంత్రం కావచ్చు. ఒకోసారి రానే రాడు. పద్దట్నుంచి తిండి కూడా లేకుండా కాసుకోని సందేళకు ఇంటికి పోయినామనుకో, ఇంట్లో గమ్మున ఉంటారా....మెట్లతో కొడతారు. ఇంతసేపు యాడ తిరిగినావురా. దుడ్డేం చేసినావురా...అని"

"అప్పుడు కూడా ఇంతేనా రమేషు"

"అప్పుడూ అంతే ఇప్పుడూ అంతే. పుట్టుకతో వచ్చిన బుద్ధి పుడకల దాంకా పోదంటాండ్లా. ఇంగ అంతే ఆయన. ఇప్పుడు ఎవురూ లేరంట కదా ఆయన దగ్గిర."

"ఎవురుంటారు ప్రసాద్. దుడ్డు టయానికి రాదు. పనీ మన చేత ఎక్కువ చేయించుకుంటాడు."

"నేనొక్కన్నే నాలుగేండ్లు ఆయన దగ్గిర పనిచేసిందేది. ఇప్పుడు నీ పరిస్థితి ఎట్లా సురేంద్రా. మీ భార్యకు కాన్పయిందా?"

"లేదు. ఇంగా ఇరవై రోజులు టైముండాది. చేతిలో దుడ్డు లేదు. ఏం చేయాల్నో అర్థంకాలా." అన్నాడు బాధగా సురేంద్ర.

"నా పరిస్థితీ అట్లే వుంది. పని యాడన్నా చేస్తాండావా లేదా."

"చూస్తాండావు కదా. మేస్త్రీలతో మనం పడతాండే బాధలు. వారం పొడుక్కు కష్టపడేది. ఆదివారమయితే చేతిలో దుడ్డు లేకుండా బాధపడతాండేది. కష్టపడినా దుడ్డు రానప్పుడు గమ్మునుండేది మేలు కదా అనుకొన్నే. ఏదన్నా చిల్లర పని వస్తే చేసేది. లేకుంటే ఇట్ల మేస్త్రీ దగ్గిరికో, ఇంజనీర్ కాడికో తిరగతాండేది. ఏదన్నా ఒగ ఇంటిపని వస్తే చాలు. మనం పనిచేస్తే దానికి తిరుగుండదు కదా! పనిని చూసి మళ్ల వాళ్లే పనులు ఇస్తారు. సమచ్చరానికి నాలుగు ఇండ్ల పనులు వచ్చినా చాలు, బతికిపోవచ్చు."

"రమేష్, ఈశ్వరాచారి అట్లా వోళ్లకయితే పనులు ఇస్తారు. అట్లా వోళ్ల దగ్గిరా పనిచేసేది మనట్లా వోళ్లే కదా! అదే పని మనకు ఇస్తే పది రూపాయలు తక్కువకు చేస్తాం. అట్లీరే. మా మామది ఒగ పనుండాది. నన్ను అడుక్కొంటాండాడు పనికి రమ్మని. వచ్చేటిగా ఉంటే రేపు సోమవారం నుంచిరా. నేనూ పోతాను."

"ఈ రోజు ఇంజనీర్ తప్పకుండా పని ఇప్పిస్తానన్నేడు. కాంట్రాక్టర్ వరదరాజులుండ్లా. ఆయన నాలుగు గంటలకు పళనీకాడికి రమ్మన్నేడు. ఏదో ఒగతావన పని గ్యారంటీగా వస్తాది. అట్ల పని వస్తే నువ్వు కూడా రావాల. ఒగేల పని ఏదీ రాకపోతే మీ మామ దగ్గిరికి పోదాంలే."

"నువ్వు పిలాల్నే కానీ పనికి రానా! బంధువుల దగ్గిర పనికి పోవడం నాకిష్టం లేదు. తప్పకుండా వస్తాను."

"ఇప్పుడు యాడ చేస్తాండారు పని."

"పనిలేదు. నాలుగు రోజులయింది. తోజులేదని ఆయన రెండు రోజులు లీవు ఇచ్చినాడు. నేను రెండు రోజులు తీసుకున్నే. వేరే చిల్లర పని ఉంటే చేస్తాండా. రేపయిపోతాది. ఇంగ సోమవారంనుంచీ మా మామ దగ్గిరికి పోతే పోవాల. ఉండుండు. టీ డబ్బు నేనిస్తా."

"పర్లేదులే. నేనిస్తాను. పోదాం ప్రసాద్. ఇంజనీర్ పదకొండుకు రమ్మన్నేడు. సాయంత్రం మరిచిపోవద్దు." అంటూ లేచాడు సురేంద్ర.

"నేనెందుకు మరిచిపోతాను." అన్నాడు అతన్ని అనుసరిస్తూ ప్రసాద్. ఇద్దరూ సైకిల్‌లు ఎక్కి చెరొక పక్క బయలుదేరారు.

పదకొండు గంటలు కాకముందే ఎండ తీవ్రంగా ఉంది. ఆలస్యమయితే ఎక్కడ ఇంజనీర్ వెళ్లిపోతాడో అని చాలా వేగంగా వెళ్లాడు సురేంద్ర. ఇంజనీర్ ఇంటిముందు బైక్ ఉండడంతో కొంత మనశ్శాంతి అనిపించింది సురేంద్రకు. ఇంజనీర్ ఇంటిముందున్న కానుగ చెట్టుకింద

సైకిల్ ఆపాడు. నీడలో నిల్చున్నాడు. ఎండనుండి వచ్చి నీడలో నిల్చోవడంతో వళ్లంతా చెమటతో తడిసిపోయింది. కర్చీఫ్ తీసి చెమట తుడుచుకున్నాడు. దాహంతో నోరు ఆరిపోతుండటంతో ఎదురుగా ఉన్న చిల్లర కొట్టులో నన్నర్ తాగాడు. చెట్టుకింద చేరి ఐదునిమిషాలున్న తర్వాత గేటు తీసి లోపలకు వెళ్లి కాలింగ్ బెల్ నొక్కాడు. ఐదారుసార్లు కాలింగ్ మోగిన తరువాత ఇంజనీర్ వచ్చి తలుపు తీశాడు. అతని కళ్లు ఎర్రగా ఉన్నాయి.

"నమస్తే సార్" అన్నాడు సురేంద్ర.

"ఎవరూ...నువ్వా ఆచారీ...మంచి టయానికి వచ్చినావు. ఎండకు ఒళ్లు హీటైపోయింది. రెండు ఐస్‌క్రీములు తెద్దువుండు." అని లోపలికి వెళ్లి బ్యాగు, డబ్బు తెచ్చి సురేంద్ర చేతికి ఇచ్చాడు.

సురేంద్ర సైకిల్‌లో వేగంగా వెళ్లి తీసుకుని వచ్చాడు. అంతవరకు ఇంజనీర్ తలుపుకు ఆనుకుని కూర్చుని ఉన్నాడు. బ్యాగులోంచి ఐస్‌క్రీములు తీసుకుని "మర్చిపోయినా ఆచారి. కడుపులో తిప్పినట్టుగా ఉండాది. రెండు సోడాలు తెస్తావా" అన్నాడు ఇంజనీర్.

"సరే సార్. సోడాలు చాల్నా నన్నర్ గూడా తేనా?" అన్నాడు సురేంద్ర.

"నన్నర్లు అయ్యన్నీ ఏమొద్దు. అరలీటరు సోడా బాటిల్ అని అడుగు. ఇస్తారు. రెండు తీసుకునిరా. తలనొప్పిగా ఉండాది. బిన్నే రావాల." అన్నాడు ఇంజనీర్.

"ఎంత సేపు ఇప్పుడే వచ్చేస్తాను సార్" అంటూ వెళ్లాడు సురేంద్ర, అన్నట్లుగానే వెళ్లినంత వేగంగా తిరిగి వచ్చాడు.

వాటిని చేతికి తీసుకుంటూ "నువ్వు రాకుండా ఉన్నింటే చాలా ఇబ్బంది పడిందు. రాత్రి నుంచి ఒగటే తలనొప్పి. తల కదిల్తే నొప్పి ఎక్కువగా వుండాది. ఏమింత ఎండలో వచ్చినావే?" అడిగాడు ఇంజనీర్.

"ఇంటి పని ఇప్పిస్తానంటిరి కదా సార్!" అన్నాడు నసుగుతూ సురేంద్ర.

"ఓ...మరచే పొయ్యినా. ఈరోజు బయటే రాలేను. రేపు మళ్లా ఇదే టైముకు రా. ఏదో ఒగ పని గ్యారంటీగా ఇప్పిస్తాను" అంటూ పైకి లేచాడు ఇంజనీర్.

"సరే సార్" అని ఉసూరుమంటూ వచ్చి సైకిల్ ఎక్కాడు సురేంద్ర. ఇంటికి బయలుదేరాడు. 'రెండు తావల ఈరోజు పని దొరకలా. కాంట్రాక్టర్ ఏమంటాడో. ఇంటి ఓనర్ వచ్చి పాయనేమో. సందేళ ప్రసాద్ దుడ్డు ఇస్తాడో ఈడో' అనుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. ఇంట్లో సుజాత ముభావంగా ఉంది. కాళ్లు చేతులు కడుక్కుని వచ్చి భోజనానాకి కూర్చుంటూ. "ఎందుకే ఆ మాదిర్తో ఉండావు?" అనడిగాడు భార్యను.

"ఎట్లుండాను." అంది అంతే ముభావంగా.

తను బాధగా ఉంటే ఆమె ఎక్కడ బాధ పడుతుందో అని తనకు ఆ రోజు ఎదురైన

అనుభవాలను ఆమెతో పంచుకోకుండా "ఎందుకో బాధ పడతాండావు. చెప్పు" అన్నాడు.

"ఏం లేదు." అంది అతినికి ఎదురుగా కూర్చుంటూ.

"నువ్వూ పెట్టుకో" అన్నాడు.

"తిన్నేను" అంది సుజాత.

సురేంద్ర మౌనంగా అన్నం తిని లేచి మంచం మీద కూర్చున్నాడు. అతని చేతికి ఒక ఉత్తరం ఇచ్చింది సుజాత. కుదువ అంగడినుంచి వచ్చిందది. కుదువ పెట్టిన నగలకు సంవత్సరం అవుతున్నా వడ్డీ కట్టలేదని, వెంటనేడబ్బు చెల్లించి నగలు తీసుకోకపోతే వేలం వేస్తామనే సారాంశం అందులో ఉంది. భార్య ముభావంగా ఉండటం వెనుక ఆంతర్యం అర్థమయింది సురేంద్రకు. కళ్లు మూసుకుని పడుకున్నాడు. పెళ్లయిన కొత్తలో సుజాతకున్న నగలు గుర్తొచ్చాయతనికి. ప్రస్తుతం ఆమె చెవుల్లో కమ్మలు తప్ప వంటిమీద ఎలాంటి నగలూ లేవు. కనీసం ఆ నగలు వున్నే కాన్పుకు భయం వున్నిండదు. తన చేతగానితనాన్ని నిందించుకున్నాడు. కడుపుతో వున్నా రెండు వారాలకొగసారి కూడా మాంసం పెట్టలేకున్నాడు. భార్యతో మాట్లాడే సాహసం చేయలేకపోయాడు. పడుకున్నాడన్న మాటేగాని సురేంద్రకు నిద్ర రాలేదు. అరగంట సేపు స్తబ్ధుగా పడుకుని లేచి ముఖం కడుక్కుని బయటకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు.

"ఎందుకే బాధపడతావు. ఎప్పుడూ కాలం ఇట్లే ఉండదులే. మనకూ మంచి రోజులొస్తాయి. కాంట్రాక్టర్ మనూరి పక్కోడే. నాకు నమ్మకముంది. ఆయన గ్యారంటీగా పని ఇప్పిస్తాడు. పోయొస్తా." అన్నాడు.

"ఏమొస్తాయో ఏమో..." అంది నిరుత్సాహంగా సుజాత.

"నాకు నమ్మకముండాది సుజీ. మనం బాగుపడతాం. కొన్ని రోజులు బాధలు తప్పవు. వస్తా. సందేళబిన్నే వచ్చేస్తాలే." అని చెప్పి సైకిల్‌లో బయలుదేరాడు కాంట్రాక్టర్ దగ్గరకు.

సురేంద్ర ముందుకు వెళుతుంటే అతని ఆలోచనలు సంవత్సరం వెనక్కు వెళ్లాయి.

"ఏంబా ఆచారీ...ఇంగా ఎన్ని రోజులు పడతాది" అడిగాడు వెంకటేష్.

"ఎన్నో రోజులు ఎందుకు పడతాదిన్నా. ఒక గంటసేపు పని."

"సామాన్లు ఎత్తుకోని పోవద్దు." అన్నాడు నాగరాజు.

"ఒగరోజు కూలి ఈ. ఎత్తుకోని పోను."

"మళ్లా నీ దగ్గరకి మేము తిరగలేము. సామాన్లు పెట్టేసిపో."

"ఔనాచారి గంటసేపు పనంటా ఉండావు. చేసేసి పోవచ్చు కదా!" అన్నాడు వెంకటరావు.

"నేనేమన్నా చెయ్యనన్నేనా. మెటీరియల్ తీసీమను. ఇప్పుడే చేసేసి పోతా. దీని కోసరం మళ్లా ఒగరోజు పని పంచేటు చేసుకోని రావాల. అయినా వస్తానంటా ఉండాను కదా! మీరు

బెంగుళూరుకు పొయ్యి వచ్చినాంక వస్తాలే. ఇంటి కాడ రెండు స్టూల్లు కొట్టాల. రేపు ఆపనన్నా అవతాది." అన్నాడు సురేంద్ర.

"యోవ్....అవన్నీ కాదు. సామాన్లు పెట్టేసిపో.." అన్నాడు నాగరాజు కోపంగా.

అప్పటికి అరగంటనుంచి వారి మధ్య వాగ్వివాదం జరుగుతోంది. వెంకటరావు, వెంకటేష్ రావడంతో నాగరాజు అరుపులు మరింత ఎక్కువయ్యాయి. సురేంద్రలో సహనం నశించింది.

"ఏమనుకొంటాండావుయ్యా నువ్వు. పనన్నా పనోళ్లన్నా తమాషాగా ఉండాదే. నీ పోలీస్ ఫ్రెండ్స్‌ను చూస్తే భయపడతాననుకున్నేవా. మెటీరియల్ తీసీ. ఇప్పుడే చేసిచ్చి పోకపోతే అప్పుడు మాట్లాడు. ఏంనా. వెంకటేషన్నా. ఎన్ని రోజులయిందినా. ఈ పని ఒప్పుకోని. మీకు గుర్తుండే ఉంటాది. ఆరోజు మీరు ఉన్నేరు. ఇంతకుముందు శుక్రవారంకాక అంతకుముందు వారం కదా పని ఒప్పుకొనింది. ఈ రోజుకు సరిగ్గా రెండు వారాలవుతాండాది. రెండు వేలా ఐదు నూర్లడిగితే ఏడు నూర్లు ఇస్తానని లాస్టుకు పదకొండు నూర్లు ఇస్తానన్నేడు. అప్పట్లో ఇద్దరం మనుషులం చేస్తే నాలుగురోజుల్లో అయిపోతాదిలే అనుకొంటి. చూస్తానే ఉండారు కదా. రెండు వారాల నుంచీ ఇద్దరం రోజూ వస్తాండాం. మేము ఎనిమిదికి వస్తే ఈయన పదిగంట్లకు వస్తాడు. పన్నెండుకు మెటీరియల్ తీసిస్తాడు. మొత్తం తీసీలా. తీసిచ్చింటే ఎప్పుడో అయిపోయిండు. లేక్కేసుకోన్నా. పధ్నాలుగు రోజులు ఇద్దరం మనుషులం. ఇరవై ఎనిమిది మస్టర్లు. పదకొండు నూర్లు. రోజుకు ఎంత పడతాదిన్నా మనిషికి. నలభై కూడా రాదు. ఇట్లా పనిచేస్తే మేము అడక్కతినాల్సిందే. రోజూ కూలికి పోయిన్నే బాగుండు. వారమయ్యేలకు చేతిలో దుడ్డు పడతాది. ఈ పని మధ్యలో వదిలేసి పోతే బాగుండేదే, చేసేసి పోదాం అనుకొంటే, ఇట్ల ఉడకాడిపిస్తాడు. మీరుండారని మళ్లా బెదిరింపులు." అన్నాడు కోపంగా సురేంద్ర.

"ఎందుకాచారి అంత కోపం. వాడి మాటలకేంలే. మన్నాడొచ్చి చేసేయి." అన్నాడు వెంకటేష్.

"నేనేమన్నా చెయ్యనంటే కదాన్నా. ఇంగ గంట సేపు పని ఉండాది. నాకు రెండు నూర్లు రావాల. గంటసేపు కోసం పాలుమాలి రెండు నూర్లు వదులుకుంటానా. ఇందో చూడండిన్నా. మాకు ఆ తొమ్మిది నూర్లు కూడా ఎన్నిసార్లు ఇచ్చినాడో" అంటూ వెంకటేష్ చేతికి చిన్న పుస్తకం ఇచ్చినాడు. దాన్ని అతను పరిశీలనగా చూసి

"ఏందిరా నాగరాజా. రెండు వారాలు పని చేయించుకోని ఇట్లా డబ్బు ఇచ్చేది? వందా, రెండు వందలు, నోటేబై, రెండువందలా యాభై, రెండు వందలు. మొత్తం తొమ్మిది వందలు. ఒగసారిగా ఇచ్చింటే వాళ్లకు ఏదన్నా అవసరం తీరిండు కదా" అన్నాడు వెంకటేష్.

"ఆ దుడ్డు కూడా సందేళ పని ఎత్తతానే ఈలాన్నా. రాత్రి అంగడి మూసిందాకా కాసుకోనుంటే అప్పుడు ఇస్తాడు. అదంతా మా కర్మలే. మన్నాడు వచ్చి నేను చేసిచ్చేస్తాలే."అంటూ కొయ్య పనిచేసే పనిముట్లు అన్నీ గోతంలో వేసాడు. దాన్ని దారంతో కట్టాడు.

"ఈ పనితో బేజారయిపోయింది. ఇంగ సొంత పనే వద్దనుకొంటాండాన్నా. రేపోరం నుంచి యాడన్నా కూలికిపోతాను" అన్నాడు సామాన్ల గోతం ఎత్తి సైకిల్‌లో పెట్టుకుంటూ.

"అట్లనుకుంటే ఎట్ల ఆచారి. అందరు ఒగ మాదిర్తోనే ఉంటారా. అన్నేల్లు ఒగటిగా ఉండవు కదా" అన్నాడు వెంకటరావు.

జీపు అడ్డంగా రావడంతో సురేంద్ర ఆలోచనలకు అంతరాయం కలిగింది. బ్రేకులు గట్టిగా వేశాడు. జీపతన్ని తిట్టుకుంటూ తిరిగి ముందుకు సాగాడు. సురేంద్రకు ఎవరితో ఎన్ని మాట్లాడుతున్నా ఇంటి బాడుగ ఎట్ల? అనే ఆలోచన ఒకపక్క తొలుస్తూనే ఉంది. పళనీ థియేటర్‌కు ఎదురుగా నీళ్ల ట్యాంకు పని జరుగుతోంది. అక్కడకు వెళ్లాడు సురేంద్ర. మేస్త్రీలతో కలిసి ఇరవై మంది పని చేస్తున్నారక్కడ. సైకిల్‌కు స్టాండ్ వేసి వాళ్ల దగ్గరకు వెళ్లి నిలుచున్నాడు.

అక్కడ నిల్చుకోనున్న ఒకతను. "ఎవరు కావాలయ్యా" అన్నాడు.

"కాంట్రాక్టర్ సార్ రమ్మన్నేరు."అన్నాడు సురేంద్ర అతన్ని పరిశీలనగా చూస్తూ.

"ఏం పని"

"కార్పెంటర్‌ను." అన్నాడు అతని రెండు చేతులకూ ఉన్న ఆరు ఉంగరాలను, ఖరీదయిన బట్టలను గమనిస్తూ.

"ఏం...పని ఇస్తానన్నేడా?

"అవునండీ"

"యాడ చేస్తాండావు పని"

"ఇన్ని రోజులు వేరే అతని దగ్గిర కూలికి పోతాంటి. చిన్న చిన్న పనులు సొంతంగా చేస్తాండా. సార్ పని ఇప్పిస్తానన్నేరు. అందుకనే వచ్చినా."

"ఎంతమంది పనిచేస్తాండారు నీ దగ్గర?"

"నలుగురుండారు సార్"

"ఏమయినా మీకు మంచి లాభం కదా ఈ పనిలో"

"....."

"చిన్న పనున్నే కానీ ఐదారు మందిని పెట్టి పని చేపిస్తారు. పనోళ్లకు ముప్పై నలభై రూపాయలు కూలి ఇస్తారు. ఇండ్లగలోల్ల దగ్గర మాత్రం మనిషికి నూరూ నూటేభై వసూలు చేస్తారు. కార్పెంటర్ మేస్త్రీకి పని చెయ్యక పోయినా రోజుకు ఐదారు నూర్లు వస్తాది కదా?" అన్నాడతను.

"ఈ కాలం పని చెయ్యనోళ్లకు ఎక్కువ దుడ్డు ఇచ్చేంత తెలివి తక్కువోళ్లు ఎవరుండారు సార్. ముప్పై నలభైకి పని చేసే వోళ్లు గూడా ఉండారా?" అన్నాడు సురేంద్ర.

"అట్లే చెప్తారులేయ్యా మీ ఆచార్లంతా. నాకు తెలీదా మీ పనుల గురించి. కొయ్యలు తీస్తే కమీషన్. ప్లై వుడ్ షాపులో కమీషన్. ఎంత చిన్న ఇల్లయినా కొయ్యకు లక్ష రూపాయలయినా అయితాది. టెన్ పర్సెంట్ కమీషన్ తీస్తారు. గంటసేపు పని. పదివేలు వస్తాది. నెలంతా కష్టపడి ఫ్లాటమ్మినా మాకు రాదు కదయ్యా అంత ఆదాయం" అన్నాడతను తనకు కొయ్యపని గురించి బాగా తెలుసు అన్నట్లుగా.

అతని మాటలు సురేంద్రకు కంపరం కలిగిస్తున్నాయి. అక్కడి నుంచి వెళ్లి పోదామా అనుకుంటున్నాడు. కాంట్రాక్టర్ వస్తాడేమో. ఈ రోజు పని ఇప్పిస్తాడేమో. తను పని చెయ్యాల్సింది ఇప్పుడు తనతో మాట్లాడుతున్న అతని ఇంటిదేనేమో అనుకుని వస్తున్న కోపాన్ని అణచుకున్నాడు.

"గంటకు పదివేలు వచ్చేటిగా ఉంటే ఇంత దూరం సైకిల్‌లో ఎందుకొస్తాను సార్."

"మీకు ఎంత డబ్బు వచ్చినా తాగేదానికే చాలదు. మిగిలేది యాడ?" అని నవ్వాడతను.

"మీరు ముందే అనుకొన్నేరు. ఆచార్లు ఇట్ల ఉంటారని. ఇంగ నేను ఎన్ని చెప్పినా లాబమేముందిలే సార్. ఆచార్లను చెడిపేస్తాండేది ఇండ్ల గలోల్లే సార్. ఒగ మనిషి పని చేస్తే వెయ్యి రూపాయలు వస్తాదనుకోండి. దానికి వారం రోజులు తిప్పుతారు. ఆ వారం రోజులు పని పంచేటు కాదా." అన్నాడు నిరుత్సాహంగా సురేంద్ర.

"ఆచార్లు మాటలు బాగా నేర్చుకున్నేరులేయ్యా. సెల్ మోగతాంది. కాంట్రాక్టరే అయ్యుంటాడు." అంటూ జేబులోంచి సెల్ తీసి చెవి దగ్గర ఉంచుకొన్నేడు.

"ఆ... ఆడుండావా. సరే. అన్నే ఉండు వస్తాండా. ఆచారీ కాంట్రాక్టర్ ఈ రోజు రాడయ్యా రేపే ఇంగ." అని అతను బైక్‌లో వెళ్లిపోయాడు.

సురేంద్రకు ఏం చేయాలో అర్థం కాలేదు. రకరకాల ఆలోచనలు. స్వంత పనులు అస్సలు రావేమో అనుకున్నాడు. లేదు లేదు.. తప్పకుండా పనులు వస్తాయి. కాకపోతే కొంత లేటయితాది. అంతవరకూ ఏం చేయాల? ప్రశ్నకు సమాధానం చిక్కలేదు. సైకిల్ ఎక్కి లీలామహల్ దగ్గరకు చేరుకున్నాడు. అప్పటికే ప్రసాద్ అక్కడున్నాడు. సురేంద్రను చూస్తూనే టీ చెప్పాడు. సురేంద్ర వేగంగా సైకిల్‌లో రావడంతో శరీరమంతా చెమలు నిండాయి. కర్చీఫ్ తీసి తుడుచుకొంటూ. "దుడ్డు వచ్చిందా?" అనడిగాడు.

"ప్చ్...రాలా. నన్ను ఈరోజు రమ్మని చెప్పినాడు. ఆయన నిన్నే ఊరికి పొయ్యినాడు" అన్నాడు బాధగా ప్రసాద్.

"దానికి నువ్వేం చేస్తావులే. నారాత సరిగా లేదు" అన్నాడు ఏడ్వలేక నవ్వుతూ సురేంద్ర.

"మా పరిస్థితి కూడా సరిగా లేదు సురేంద్రా. ఇంట్లో నగలు కూడా లేవు. లేకుంటే అయ్యి పెట్టేసయినా నీకు దుడ్డు ఇచ్చిందు."

"అందరి పరిస్థితి అట్లే ఉండాదిలే." అన్నాడు సురేంద్ర టీ తీసుకుంటూ.

"నీ దగ్గర సానరాయి ఉందా. నా దగ్గిరున్నింది మామామ తీసుకున్నేడు. రేపు మద్యానం దాంకా ఒగ పని ఉండాది."

"ఉన్నింది కానీ, కింద పడి ఇరిగిపోయింది. ఇంగోటి ఉండాది. అది బాగా అరిగి పోయింది."

"కొత్తది కొనాలంటే నూరు రూపాయలు." అన్నాడు ప్రసాద్.

పని దొరకనందుకు, డబ్బు చేతికి రానందుకు సురేంద్రకు ఏం చేయాలో అర్థం కాలేదు. బాడుగ కోసరం ఇంటి యజమాని వస్తే ఏం చెప్పాలో తెలీలేదు. కాన్పుకు సిద్ధంగా వున్న భార్యను తలచుకోగానే భయం వేసింది. ప్రసాద్‌తో ఇంటికి పోతున్నానని కూడా చెప్పకుండా మౌనంగా సైకిల్ ఎక్కాడు సురేంద్ర.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, అక్టోబరు 17, 2003*